ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

శుక్రవారం 19 జూలై 2024

రుణమాఫీపై రైతులు, కాంగ్రెస్ నేతల సంబరాలు 8లో..

కార్మిక కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే 8లో..



జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ నాయకుల సంబరాలు..

రైతుల కళ్లలో ఆనందం

- రుణ మాఫీని ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి
- జిల్లావ్యాప్తంగా రైతులు, కాంగ్రెస్ నేతల సంబరాలు
- మొదటి విడతలో జిల్లాలో 29,274 మందికి లబ్ధి

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండు లక్షల వరకు రైతుల రుణమాఫీ పథకాన్ని ప్రారంభించడంతో రైతుల కళ్లలో ఆనందం కనిపిస్తోంది. వారి ముఖాల్లో చిరునవ్వులు విరబూస్తున్నాయి. గురువారం సాయంత్రం 4గంటలకు లాంఛనంగా ఆరంభించారు. తొలి విడతలో లక్ష రూపాయల వరకు మాఫీ సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. జిల్లాలో 29,274 మంది రైతుల ఖాతాల్లో సుమారు 157.65 కోట్ల రూపాయల వరకు డబ్బులను రైతుల ఖాతాల్లో క్రమంగా జమ అవుతున్నాయి. మిగతా రైతులకు ఆగస్టు 15వ తేదీలోపు రుణ మాఫీ కానున్నదని అధికార వర్గాలు పేర్కొన్నాయి. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నెరవేర్చుతున్నది. రుణ మాఫీ పథకాన్ని ప్రారంభించిన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులను ఉద్దేశించి మాట్లాడారు. జిల్లాలోని 14 మండలాల్లో అధికారికంగా సంబరాలను నిర్వహించారు. జిల్లాలో మొదటి విడత లక్ష రూపాయల వరకు 29,274 మంది రైతులకు రుణ మాఫీ కానున్నది. సాయంత్రం వరకు రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కాలేదు. పాలకుర్తి రైతు వేదికలో జరిగిన కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ పాల్గొన్నారు. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్, కోయ శ్రీహర్ష, జిల్లా వ్యవసాయ శాఖాధికారి దోమ ఆదిరెడ్డి పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే విజయరమణారావు ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయం నుంచి జెండా చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. మంథని, కమాన్‌పూర్, రామగిరి మండలం రత్నాపూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మంత్రి సోదరుడు శ్రీనివాస్ బాబు మంథనిలో ఎడ్లబండిపై వచ్చి కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులతో కలిసి సంబరాలు నిర్వహించారు. గోదావరిఖని చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ పాల్గొన్నారు. ధర్మారంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.



ఖనిలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌కు స్వీట్లు తినిపిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గత ప్రభుత్వంలో వడ్డీ చెల్లించా..

- నాడెం లక్ష్మయ్య, చందపల్లి



గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల క్రితం బ్యాంకు ద్వారా 75 వేల రుణాన్ని అప్పుగా పొందాను. మాఫీ చేస్తామని ప్రకటించడమే తప్ప మాఫీ చేయలేదు. దీంతో వడ్డీలు చెల్లించాను. 5 ఏళ్ల పాటు వడ్డీ చెల్లించగా ఒకేసారి రుణమాఫీ ప్రకటించి మాఫీ చేసింది. తిరిగి 2023 అక్టోబర్‌లో 85 వేల రుణాన్ని అప్పుగా తీసుకున్నాను. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఒకే దఫాలో మాఫీ చేయడం సంతోషంగా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులు రుణపడి ఉంటారు.

కేసీఆర్ ప్రభుత్వంలో అప్పు తీసుకున్న..

- మాచర్ల లక్ష్మీ, గౌరెడ్డిపేట



కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు క్రాప్‌లోన్ కింద 50 వేలను అప్పుగా తీసుకున్నాను. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నంత వరకు వడ్డీ చెల్లించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఒకేసారి 50 వేలను మాఫీ చేయడం చాలా సంతోషంగా ఉంది. రేవంత్ ప్రభుత్వానికి మా కుటుంబం రుణపడి ఉంటుంది.

ఏక కాల రుణమాఫీతో మనోధైర్యం..

- అల్గాం రాజేశం, ముత్తారం



పదేళ్లుగా రైతు రుణమాఫీ లేక అప్పులు తెచ్చి వడ్డీలు కట్టలేక చాలా ఇబ్బందులు పడ్డాం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఏకకాలంలో రుణమాఫీ చేయడం వల్ల మాకు మనోధైర్యం పెరిగింది. నాకు ఉన్న రూ. అరవై వేల రుణం ఏకకాలంలో మాఫీ అయింది. దీంతో నాకెంతో ఆనందంగా ఉంది.

రుణమాఫీతో సంతోషంగా ఉంది..

- పిల్లి భూమయ్య, తెలుకుంట



కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేయడం నాకు చాలా సంతోషంగా ఉంది. నేను ఎలిగేడు సహకార బ్యాంకులో 55వేల రూపాయల అప్పు తీసుకోగా, ఆ రుణం మాఫీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి నా ధన్యవాదాలు.

ముందస్తుగా చేస్తారని ఊహించలేదు..



- ఐలి రవి, గుంజపడుగు

రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ ఆగస్టు 15 నుంచి చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికి ముందుగానే చేయటాన్ని స్వాగతిస్తున్నాం. ఇచ్చిన హామీకంటే ఇలా ముందస్తుగానే రుణాలు మాఫీ చేయడాన్ని రైతులు ఊహించలేకపోయాం. నాకు ఉన్న 1.30 గుంటల భూమిపై బ్యాంక్‌లో రూ.40 వేల పంట రుణం తీసుకున్నాను. అవి ఇప్పుడు మాఫీ కావడం చాలా సంతోషంగాఉంది.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం

- ఇల్లెందుల శ్రీనివాస్‌గౌడ్, కనుకుల



రైతలకు ఏకకాలంలో రుణమాఫీ వర్తింపచేసిన ప్రభుత్వాలు లేవు. కేవలం సీఎం రేవంత్‌రెడ్డికే ఈ ఘనత దక్కుతుంది. లక్ష రూపాయలలోపు రుణమాఫీలో భాగంగా నాకు బ్యాంకులో ఉన్న 39 వేల రూపాయల రుణం మాఫీ అయింది. లక్షలోపు ఉన్న చాలామంది రుణాలు మాఫీ అయ్యాయి. ఎన్నికల సందర్భంగా రైతాంగానికి ముఖ్యమంత్రి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు.

కాల్వశ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సీపీ



సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న సీపీ శ్రీనివాస్

కాల్వశ్రీరాంపూర్, జూలై 18: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలతో పాటు పోలీస్ స్టేషన్‌లోని రిసెప్షన్ సెంటర్ సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బంది వివరాలు, నిర్వహిస్తున్న పనితీరు, వారికి ఏదైనా సమస్యలు ఉన్నాయా అని తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధి భౌగోళిక పరిస్థితులు, ముఖ్యమైన ప్రదేశాలు, ఈ ప్రాంతంలోని మావోయిస్టుల, వారి కుటుంబ వివరాలు, పోలీస్ స్టేషన్ పరిధి గ్రామాల్లో ఎలాంటి నేరాలు అధికంగా జరుగుతున్నాయి, వాటిని ఏ విధంగా నియంత్రణ చేయాలి అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవరిస్తూ కేసుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకుని జాప్యం చేయకుండా పరిష్కరించాలన్నారు. బాధితులకు పోలీస్ అండగా ఉంటూ సత్వర న్యాయం చేస్తారనే నమ్మకం భరోసాకలిగించే విధంగా ప్రవర్తించాలన్నారు. పోలీసు సిబ్బంది ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా ఉంటూ విధులు క్రమశిక్షణతో నిర్వహించాలని తెలిపారు. లా అండ్ ఆర్డర్ సమస్యలపై, పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు తెలుసుకొని త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని, బీట్లు, పెట్రోలింగ్ పకడ్బందీగా నిర్వహిస్తూ నేరాలను నియంత్రణ చెయ్యాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ చేతన, పెద్దపల్లి ఏసీపీ జి కృష్ణ, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, కాల్వ శ్రీరాంపూర్ ఎస్ఐ ఓంకార్‌యాదవ్‌లు ఉన్నారు.

చెడు అలవాట్లకు బానిసలు కావొద్దు

- గోదావరిఖని ఏసీపీ రమేష్

కోల్‌సిటీ టౌన్, జులై 18 : యువత విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని గోదావరిఖని ఏసీపీ రమేష్ అన్నారు. గోదావరిఖని వన్ టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో గురువారం స్థానిక కాకతీయ జూనియర్ కళాశాలలో గంజాయి, మాదక ద్రవ్యాల వాడకం, వాటి వల్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏసీపీ ఎం రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై అవగాహన కల్పించారు.

మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 18: విద్యార్థులు మత్తు పదార్థాల నివారణపై బుధవారం గోదావరిఖని టూటౌన్ పోలీసుల ఆధ్వర్యంలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ ప్రసాదరావు విద్యార్థులకు డ్రగ్స్, గంజాయి వాడకం వలన కలిగే అనర్థాలను వివరించారు.

నేడు కొలనూర్‌కు మంత్రుల రాక

ఓదెల, జూలై 18 : మండలంలోని కొలనూర్‌లో రూ.1.50కోట్ల నిధుల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం ప్రారంభోత్సవానికి శుక్రవారం మంత్రులు, ఎంపీలు హాజరుకానున్నారు. ఆరోగ్య కేంద్రం భవనంతో పాటు పలు రోడ్లను మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎంపీ గడ్డం వంశీ కృష్ణలు ప్రారంభించనున్నారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ కోయ శ్రీహర్ష, సీపీ శ్రీనివాస్, డీసీపీ చేతన, ఏసీపీ గజ్జి కృష్ణ, అదనపు కలెక్టర్ ఏర్పాట్లను పరిశీలించారు.

గోదావరిఖనిలో భారీ వర్షం



ఖనిలో కురుస్తున్న భారీ వర్షం

మార్కండేయకాలనీ/కళ్యాణ్‌నగర్, జూలై 18: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో గురువారం భారీ వర్షం కురిసింది. గురువారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు వర్షం కురుస్తూనే ఉంది. మధ్యాహ్నం, సాయంత్రం సమయంలో భారీ వర్షం పడడంతో పారిశ్రామిక ప్రాంతంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. మధ్యాహ్నం సమయంలో మబ్బులు కమ్ముకోవడంతో చీకటి అలుముకుంది. చాలా వాహనాలు లైట్ల వెలుతురులో ప్రయాణాలు సాగించాయి. భారీ వర్షంతో పారిశ్రామిక ప్రాంతంలోని అన్ని నాలాలు ఉధృతంగా ప్రవహించాయి. వాతావరణశాఖ తెలిపిన లెక్కల ప్రకారం గురువారం ఉదయం 8.30గంటల వరకు 11మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. గురువారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు 5సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు అంచనా.

మంథని, జూలై 18: మంథని ప్రాంతంలో గురువారం సాయంత్రం నుంచి రాత్రి వరకు పలుమార్లు భారీ వర్షం కురిసింది. డ్రైనేజీలు, రోడ్లన్నీ జలమయం అయ్యాయి. జనం ఇళ్లకే పరిమితమయ్యారు. పలుమార్లు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొంచెం ఆలస్యమైనా వర్షాలు బాగా కురుస్తుండటంతో వ్యవసాయ పనులు సాగుతుండటం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అజ్ఞానం, అసమానతలు తొలగించడమే లక్ష్యం..

కళ్యాణ్‌నగర్, జూలై 18: సమాజంలో ఉన్న అసమానతలు, అజ్ఞానాన్ని తొలగించడమే భారత నాసక సమాజం లక్ష్యమని నాస్తిక సమాజం కేంద్ర కమిటీ కన్వీనర్ ఉప్పులేటి నరేష్ అన్నారు. గురువారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 24న వరంగల్‌లో జరిగే భారత నాస్తిక సమాజం 3వ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో పోగుల శేఖర్, ఇందారపు రాయపోషం, వేముల అశోక్, జేవీ రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు

పెద్దపల్లిటౌన్, జూలై 18: రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు స్పష్టం చేశారు. రైతు రుణ మాఫీ సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు రెండు లక్షల రైతు రుణమాఫీ చేయడం సంతోషమని, పెద్దపల్లి నియోజకవర్గంలో దాదాపు 17 వేల మంది రైతులకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. మరో 2 వేల మంది రైతులకు వివిధ బ్యాంకుల్లో పొందిన రుణాలకు రుణమాఫీ వర్తించేలా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వెన్నంటి ఉంటుందని అభయమిచ్చారు. రానున్న పంట కాలానికి సన్న వడ్లను క్వింటాల్ కు 5 వందల రూపాయల బోనస్ చెల్లిస్తామని ప్రకటించారు. రైతు బీమా, పంటల బీమా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. రుణమాఫీతో పెద్ద ఎత్తున రైతులు రాష్ట్ర వ్యాప్తంగా పండుగ చేసుకుంటున్నారని తెలిపారు. ఈ దశాబ్దపు అతిపెద్ద వేడుక, రైతన్నలకు రుణమాఫీ పండుగ అని ఎమ్మెల్యే కొనియాడారు. రుణమాఫీ చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, జిల్లా మంత్రి శ్రీధర్‌బాబు, రాష్ట్ర మంత్రులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం క్యాంపు కార్యాలయం నుంచి బైక్ ర్యాలీతో జెండా చౌరస్తా వద్ద బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. స్వీట్లు పంపిణీ చేసి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఖని చౌరస్తాలో కాంగ్రెస్ సంబరాలు

గోదావరిఖని, జూలై 18: రైతులకు రూ.2లక్షల పంట రుణాన్ని మాఫీ చేయడాన్ని హర్షిస్తూ గోదావరిఖని చౌరస్తాలో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్‌రాజ్‌ఠాకూర్ హాజరయ్యారు. బాణాసంచా కాల్చి మిఠాయిలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు రైతులకు రూ.2లక్షల పంటరుణాలు మాఫీ చేస్తానని హామీ ఇచ్చిన సమయంలోపే రైతులకు మొదటి విడత రూ.లక్ష రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. ఆగస్టు 15లోపు మరో రూ.లక్ష రైతుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలను నిలబెట్టుకుందని, ఇప్పుడు పంట రుణాల మాఫీ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ బంగి అనీల్ కుమార్, కార్పొరేటర్ మహంకాళి స్వామి, ఎండీ ముస్తాఫా, కొలిపాక సుజాత, నాయకులు దీటి బాలరాజు, పెద్దెల్లి ప్రకాష్, బొమ్మక రాజేష్, చుక్కల శ్రీనివాస్, అనుమ సత్యనారాయణ, నాయిని ఓదెలు, గడ్డం సత్యనారాయణ, తిప్పారపు శ్రీనివాస్, గుండేటి రాజేష్, దాసరి సాంబమూర్తి, కుడుదుల శివ, పాతిపెల్లి ఎల్లయ్య దాసరి విజయ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ అందేలా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ పథకం జిల్లాలో అర్హులైన ప్రతి రైతుకు వర్తించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆయన రైతు రుణమాఫీపై బ్యాంకర్లు, వ్యవసాయ శాఖాధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న 2 లక్షల రుణ మాఫీ పథకాన్ని మార్గదర్శకాల ప్రకారం అందేలా చూడాలన్నారు. రేషన్ కార్డు రైతు రుణమాఫీ పథకం అమలుకు తప్పనిసరికాదని, రైతు కుటుంబాన్ని గుర్తించేందుకు ఒక ప్రామాణికంగా మాత్రమే రేషన్ కార్డును వినియోగిస్తున్నామన్నారు. భూమి ఉన్న ప్రతి రైతు కుటుంబానికి 2 లక్షల రూపాయల రైతు రుణమాఫీ పథకం అమలు అవుతుందని, ఈ అంశం పట్ల రైతులలో ఉన్న సందేహాలను నివృత్తి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. 2018డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 వరకు రైతులు నూతనంగా తీసుకున్న రుణాలు, రెన్యువల్ చేసుకున్న రుణాలు అసలు, వడ్డీ కలిపి ౨ లక్షల రూపాయల వరకు ప్రతి రైతు కుటుంబానికి మాఫీ జరుగుతుందని, రైతు కుటుంబానికి రెండు లక్షల కంటే అధికంగా రుణం ఉన్నట్లయితే కుటుంబంలోని మహిళ పేరిట ఉన్న రుణం ముందుగా మాఫీ అవుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. రైతు రుణమాఫీ సొమ్ము ప్రభుత్వం జమ చేసిన వెంటనే బ్యాంకులు లోన్ ఖాతా నుంచి సంబంధిత సొమ్మును రైతుల సేవింగ్స్ ఖాతాలోకి బదలాయింపు చేయాలని కలెక్టర్ సూచించారు. వ్యవసాయ సహకార సంఘాల బ్యాంకులు, డీసీబీ పూల్‌కు వచ్చే రుణ మాఫీ సొమ్ము సంబంధిత రైతులకు చేరేలా వ్యవసాయ విస్తరణ అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. రుణమాఫీ ఫిర్యాదులను టోల్ ఫ్రీ నంబర్ ద్వారా నమోదు చేయవచ్చు. రుణమాఫీ పథకంపై రైతులు ఫిర్యాదులను నమోదు చేస్తే పరిష్కరిస్తామని, జిల్లాలో ఫిర్యాదుల నమోదు కోసం ప్రత్యేకంగా కలెక్టరేట్‌లో టోల్‌ఫ్రీ నంబర్ సైతం ఏర్పాటు చేశామని, రుణమాఫీ పథకంపై రైతులు తమ సందేహాలను 18005995459 టోల్‌ఫ్రీ నెంబర్ ద్వారా నమోదు చేయాలని కలెక్టర్ తెలిపారు. రుణమాఫీకి సంబంధించి వచ్చే ప్రతి ఫిర్యాదు జాబితా రూపొందించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. రుణమాఫీకి సంబంధించి జారీ చేసిన ఆదేశాలు క్షేత్రస్థాయి సిబ్బందికి తెలియజేసి ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సజావుగా ప్రక్రియ జరిగేలా చూడాలని ఆదేశించారు. జిల్లాలో జరుగుతున్న సాగు పనులపై కలెక్టర్ వ్యవసాయ అధికారులతో సమీక్షించారు. క్రాప్ బుకింగ్ ప్రక్రియపై వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పూర్తిస్థాయిలో బుకింగ్ జరిగేలా చూడాలని ఆదేశించారు. నాట్లు వేసేందుకు అవసరమైన మేర ఎరువుల స్టాక్ జిల్లాలో అందుబాటులో ఉందని, మండల స్థాయిలో అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయా లేదా చెక్ చేసుకోవాలని అధికారులకు సూచించారు. రైతు బీమా పథకం కింద సంబంధిత రైతు కుటుంబాలకు పది రోజుల కంటే ఆలస్యం కాకుండా లబ్ధి చేకూరేలా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం కలెక్టరేట్‌లో రుణమాఫీ టోల్ ఫ్రీనంబర్ 18005995459ను అదనపు కలెక్టర్లు జే అరుణశ్రీ, జీవీ శ్యామ్ ప్రసాద్‌లాల్‌లతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, ఎల్‌డీఎం వెంకటేష్, బ్యాంకర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్ హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్, జూలై 18: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు ఏక కాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసినందుకు గురువారం మండల కేంద్రంలోని శ్రీ సీతా రామస్వామి ఆలయంలో ధూపదీప నైవేద్య రాష్ట్ర అర్చక సంఘం అధ్యక్షులు నిట్టూరి సతీష్‌శర్మ ఆధ్వర్యంలో ఆయుష్ హోమం నిర్వహించారు. ఈ పూజా వేడుకల్లో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పెద్దరాత్‌పెల్లిలో శుక్రవారం పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ శంకుస్థాపన సందర్భంగా ఆ స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యేతో పాటు కలెక్టర్ కోయ శ్రీహర్ష, సీపీ శ్రీనివాస్ ఆయిల్ పామ్ స్థలంలో పరిశీలించారు. మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు గాజనవేన సదయ్య, మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి, మినుపాల ప్రకాష్‌రావు అంతటి అన్నయ్యగౌడ్, చేతి ధర్మయ్య, బంగారు రమేష్, అల్లం దేవేందర్, పొన్నమనేని దేవేందర్‌రావు పాల్గొన్నారు.

ఖని ప్రభుత్వ ఆసుపత్రిలో ముగ్గురికి అరుదైన ఆపరేషన్లు

కళ్యాణ్‌నగర్, జూలై 18: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి దంత విభాగంలో ముగ్గురికి అరుదైన ఆపరేషన్లు నిర్వహించారు. విరిగిన దవడలకు ఆపరేషన్లు చేసి యథాస్థానంకు తీసుకువచ్చారు. శ్రీనివాస్ అనే వ్యక్తి ఈనెల 6న కుందనపల్లి వద్ద బైక్ అదుపు తప్పి అతని ముఖ భాగంలో ఆరు ఎముకలతో పాటు దవడలు విరిగిపోవడంతో ప్రొఫెసర్లు సుమలత, శ్రావణ్‌తేజ్ ఆపరేషన్లు నిర్వహించి ఆరు ప్లేట్లు, 20 స్క్రూలు బిగించారు. పెద్దంపేటకు చెందిన అరుణ్ అనే వ్యక్తిని మోటార్ సైకిల్ ఢీకొనగా అతని రెండు దవడలు విరిగిపోయాయి. అతనికి రూట్ కెనాల్ ద్వారా పళ్లను యథాస్థానంలో అమర్చారు. రాము అనే వ్యక్తి ఘర్షణలో అతని కుడి దవడలోని పళ్లు విరిగిపోగా అతనికి సర్జరీ నిర్వహించి పళ్లు అమర్చారు. ఈ ముగ్గురికి ప్రొఫెసర్లు నిర్వహించిన ఆపరేషన్లు విజయవంతం అయ్యాయి. గురువారం ఈ ముగ్గురిని వైద్యులు ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆపరేషన్లు క్రిటికల్‌గా నిర్వహించడం జరిగిందని, శ్రీనివాస్ అనే వ్యక్తి హైబీపీ ఉన్నప్పటికీ అతనికి ఆరు చోట్ల ఆపరేషన్లు నిర్వహించి ముఖ భాగాన్ని యథాస్థానంలోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రిలో ఒక్కొరి వైద్యానికి సుమారు రూ.3లక్షల నుంచి రూ.4లక్షల ఖర్చు అవుతాయని ఆర్ఎంఓ అప్పారావు, ప్రొఫెసర్ సుమలత చెప్పారు. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో క్లిష్టమైన ఆపరేషన్లను సైతం నిర్వహిస్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్లు, వైద్యులు

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

ఇల్లందకుంట, జూలై 18: మండలంలోని సిరిసేడు గ్రామానికి చెందిన నాగపూరి సంతోష్ అనే గీత కార్మికుడు గురువారం తాటిచెట్టుపై నుంచి పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. రోజు వారి పనిలో భాగంగా సంతోష్ కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు జారిపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన తోటి కార్మికులు జమ్మి కుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సంతోష్‌గౌడ్‌కి భుజం విరిగి నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాధితుడిని ఆదుకోవాలని స్థానికులు కోరారు.

జీఎస్టీ అధికారుల అవగాహన

- భయంతో దుకాణాలు బంద్ చేసిన వ్యాపారులు



అవగాహన కల్పిస్తున్న జిల్లా అధికారి రజక్, సిబ్బంది

ముస్తాబాద్, జూలై 18: ముస్తాబాద్ మండల కేంద్రంలో వస్తు సేవల పన్ను (జీఎస్టీ) అధికారులు పలు వ్యాపార వాణిజ్య దుకాణాలకు అవగాహన కల్పించడం కోసం రాగానే గమనించిన వ్యాపారస్తులు దుకాణాలన్నీ బంద్ చేశారు. ముస్తాబాద్ ప్రధాన రహదారికి ఇరువైపులా దుకణాల మూసివేతతో బంద్‌ను తలపించింది. జిల్లా కమర్షియల్ ట్యాక్స్ అధికారి రజక్ తన బృందంతో జీఎస్టీపై అవగాహన కల్పించేందుకు ముస్తాబాద్‌కు గురువారం వచ్చారు. జీఎస్టీ వలన కలిగే ఉపయోగాలను, ఉచితంగా జీఎస్టీ నమోదు చేయడం వంటి వివరాలను తెలియజేయడానికి జీఎస్టీ నమోదు లేని దుకాణ యజమానులకు వివరించేందుకు వచ్చామని, నమోదుతో ఇబ్బందులు లేకుండా ఉంటుందని తెలిపారు.

గొలుసుకట్టు మార్కెటింగ్‌పై అప్రమత్తంగా ఉండాలి

సిరిసిల్ల క్రైం, జూలై 18: జిల్లాలో గొలుసుకట్టు (చైన్)మార్కెటింగ్‌పై అప్రమత్తంగా ఉండాలని పోలీసుశాఖ ప్రకటించింది. గురువారం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి సైబర్ సెల్ ఒక ప్రకటన విడుదల చేసింది. ఏదైనా కంపెనీ పేరుతో ముందుగా మీరు కొంత డబ్బులు కట్టి జాయిన్ అవ్వండని, ఆ తర్వాత అందులో మరో ముగ్గురిని జాయిన్ చేస్తే లైఫ్ లాంగ్ ఆదాయం ఉంటుందని చెప్పి మోసం చేస్తారని సైబర్‌సెల్ పేర్కొంది. ఏలి అండ్ లిల్లి యాప్, వేక్ యాప్, వియాక యాప్, గ్రోమో యాప్, క్రిప్టో కరెన్సీ, ఆన్‌లైన్ ట్రేడింగ్ అండ్ అన్‌లైన్ మల్టీలెవల్ మార్కెటింగ్ కంపెనీలో అత్యాశకు పోయి డబ్బులు పెట్టి మోసపోవద్దని వెల్లడించింది. సైబర్ నేరగాళ్లు వాట్సాప్ లేదా టెలిగ్రామ్ ద్వారా ఏ యాప్‌నైనా డౌన్‌లోడ్ చేసుకోమని చెప్తే చేసుకోవద్దని, వెబ్ సైట్‌ను నమ్మవద్దని, ఇదంతా మోసం అని గ్రహించాలని పేర్కొంది. సోషల్ మీడియాలో మోసపూరిత ప్రకటనలు చూసి సొమ్మును అనాలోచితంగా అత్యాశకు పోయి గుర్తు తెలియని యాప్‌లో పెట్టి కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసుకోవద్దని, జాగ్రత్తగా ఉండాలని సైబర్ సెల్ వారు ఒక ప్రకటనలో తెలిపారు.

గంజాయి విక్రయిస్తే సమాచారం ఇవ్వాలి

సిరిసిల్ల క్రైం, జూలై 18: మీ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్నారా... అయితే వెంటనే 8712656392 కు సమాచారం ఇవ్వండని పోలీసుశాఖ విస్తృత ప్రచారం చేపట్టింది. గురువారం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఇందుకు సంబంధించిన లోగోను విడుదల చేసింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 13 పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఎవరైనా మత్తుపదార్థాలను (గంజాయి) అమ్మినా, తాగినా, సాగుచేసినా వారి గురించి ఎవరైనా సమాచారం తెలిస్తే ఫోన్ ద్వారా లేదా వాట్సాప్ ద్వారా తెలియజేయాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పోలీసు శాఖ పేర్కొంది. మాదక ద్రవ్యాల నిర్మూలనలో ప్రతీ ఒక్కరు భాగస్వామ్యం కావాలని ప్రకటించింది.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద

జగిత్యాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో పెరుగుతోంది. గురువారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గే ట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 25,694 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రా జెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 14.545 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 24.795 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 447 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 8.777 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 1.938 టీఎంసీల నీటిని అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

రెండు బైక్‌లు చోరీ

ఎల్లారెడ్డిపేట, జూలై 18: ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లోని అల్వాల రాజు, మొదుసు గౌరయ్యలకు చెందిన రెండు ద్విచక్రవాహనాలను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం అర్ధరాత్రి చోరీ చేశారని బాధితులు తెలిపారు. గ్రామంలోని రాజు, గౌరయ్యలు తమ బైక్‌లను బుధవారం రాత్రి ఇంటి ఎదుట నిలిపి ఉంచారు. గురువారం ఉదయం చూసే సరికి వాహనాలు కనిపించలేదు. గుర్తు తెలియని వ్యక్తులు ఎతుకెళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేశామని బాధితులు రాజు, గౌరయ్య తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కుక్కదాడిలో మున్సిపల్ సిబ్బందికి గాయాలు


కుక్క దాడిలో తీవ్రంగా గాయపడిన భాగ్య

హుజూరాబాద్, జూలై 18: హుజూరాబాద్, జమ్మికుంట పట్టణాల్లో రెండు రోజులుగా పిచ్చికుక్క స్వైర విహారం చేసి సుమారు 40మందిని దాడి చేసి, గాయపరిచింది. గురువారం హుజూరాబాద్ పట్టణంలో మున్సిపల్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పిచ్చికుక్క మున్సిపల్ సిబ్బందిపై విరుచుకు పడింది. దీంతో పలువురికి గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. డీసీఎంఎస్ కాంప్లెక్స్‌లో ఇన్‌చార్జీ సానిటేషన్ ఇన్‌స్పెక్టర్ కిషన్‌రావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, రమేశ్ పిచ్చి కుక్క కనబడగా పట్టుకునేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా కుక్క ఆరెల్లి రమేశ్‌ను గాయపరిచింది. అతడిని చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్రమత్తమైన మున్సిపల్ సిబ్బంది డాగ్ స్కాచ్‌ను పిలిపించి కుక్కను హతమార్చరు. కాగా గాంధీనగర్ నుంచి విధులకు వస్తున్న భాగ్యను కూడా తీవ్రంగా గాయపర్చగా వరంగల్ ఎంజీఎంకు తరలించారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, చైర్‌పర్సన్ రాధిక మాట్లాడుతూ వీధి కుక్కల బారిన ప్రజలు పడకుండా ఉండేందుకు ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

బాలుడిపై శునకం దాడి

ఓదెల, జూలై 18 : మండలంలోని గూడెంలో గురువారం కొమ్ము మోక్షిత్ అనే బాలుడిపై శునకం దాడి చేసింది. జమ్మికుంటకు చెందిన మోక్షిత్ ఇటీవల తన అమ్మమ్మ గ్రామమైన గూడెంకు రాగా, దారి వెంట వెళ్తున్న క్రమంలో కుక్కలు దాడి చేయడంతో చెంపకు రెండు చోట్ల గాయాలయ్యాయి. అక్కడున్న వారు మోక్షిత్‌ను రక్షించారు. దీంతో కుటుంబ సభ్యులు జమ్మికుంటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

రైలు కింద పడి ఒకరి ఆత్మహత్య

జమ్మికుంట రూరల్, జూలై 18: మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన గాజుల పర్శరాములు (43) అనే వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. పర్శరాములు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స తీసుకున్నప్పటికీ నయం కాకపోవడంతో మనస్తాపం చెంది జమ్మికుంట రైల్వే స్టేషన్‌కు కొంత దూరంలో గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. పర్శరాములు భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రామగుండం రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపారు.

రూ. కోటి అప్పు చేసి పరారీ..బాధితుల ఆందోళన


వ్యాపారి ఇంటి ఎదుట గుమికూడిన బాధితులు

మెట్‌పల్లి రూరల్, జూలై 18: ఎక్స్‌కావేటర్ యజమాని సుమారు కోటికి పైగా అప్పు చేసి పరారైన సంఘటన మెట్‌పల్లి మండలంలోని జగ్గసాగర్ గ్రామంలో చోటుచేసుకుంది. గురువారం బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..జగ్గసాగర్ గ్రామానికి చెందిన పెంట మహిపాల్ తనకున్న ఎక్స్‌కావేటర్ కిరాయికి నడుపుతూ ఉండేవాడు. ఊర్లో అందరితో పరిచయాలు పెంచుకున్నాడు. అత్యవసరం ఉందని కొంత మంది వద్ద వడ్డీకి అప్పులు తీసుకున్నాడు. ఉన్న ఊరు వ్యక్తే కదా అనుకుని అప్పు ఇచ్చిన వారు కూడా ఎలాంటి పత్రం లేకుండా గుడ్డిగా నమ్మి అడినంగా ఇచ్చుకుంటు పోయారు. ఇవే కాకుండా తెలిసిన వృద్ధులు దాచుకున్న పింఛన్ డబ్బులతో పొదుపు చేసుకున్న మహిళలు, కూలీ నాలి చేసుకునే వారిని వదల కుండా మహిపాల్ అప్పులు తీసుకున్నాడు. తీసుకున్న డబ్బులు ఇవ్వమంటే ఏదో సాకు చెప్పుకుంటూ కాలం వెళ్లదీసాడు. సుమారు కోటి రూపాయల వరకు అప్పు చేయడంతో అప్పు ఇచ్చిన వారు డబ్బులు ఇవ్వమని ఒత్తిడి చేశారు. అప్పు తీర్చే దారి లేక కుటుంబ సభ్యులతో కలిసి పారియాడు. గురువారం ఇంటికి బాధితులు వెళ్లి చూసేసరికి ఇంటికి తాళం వేసి ఉండటం, ఫోన్ చేసినా సమాధానం లేకపోవడంతో మోసపోయినట్లు తెలుసుకున్న బాధితులు లబోదిబోమంటూ వాపోతున్నారు. గ్రామాల్లో పలువరు వద్ద లక్షల రూపాలయలు అప్పుగా చేసినట్లు స్థానికులు చెబుతున్నారు.

యువకుడి బలవన్మరణం


అభిలాష్(ఫైల్)

కమాన్‌పూర్, జూలై 18: మండల కేంద్రంలో ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యు లు తెలిపిన వివరాల ప్రకారం.. కమాన్‌పూర్ గ్రామానికి చెందిన రెడ్డి అభిలాష్(20) డిప్లోమా ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కొద్దీ రోజులుగా కుటుంబ సభ్యులతో కలిసి గోదావరిఖనిలోని ఫైవ్‌ఇంక్లయిన్ కాలనీలో ఉంటు న్నాడు. గురువారం స్వగ్రామంలోని ఇంటికి వచ్చి ఉరేసు కొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి రెడ్డి స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

కూతురితో ప్రేమను వదులుకోవాలని హత్యాయత్నం

- యువకుడు లేకపోవడంతో తండ్రిపై దాడి

- దాడికి పాల్పడిన ఇద్దరి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ నీలం రవి

మల్యాల, జూలై 18: తన కూతురితో ప్రేమ వ్యవహారం మానుకోవాలని పలుమార్లు హెచ్చరించినా వినకపోవడంతో అమ్మాయి తండ్రితో పాటు బాబాయి యువకుడి ఇంటిపై దాడికి వెళ్లారు. కానీ అక్కడ యువకుడు అందుబాటులో లేకపో వడంతో అతడి తండ్రి పై హత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరినీ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. మల్యాల సీఐ నీలం రవి తెలిపిన వివరాల ప్రకారం.. మ్యాడంపల్లికి చెందిన గుర్రం చిన్నమల్లయ్య కొడుకు రాజ్‌కుమార్ ఇదే గ్రామానికి చెందిన బాసవేని గంగాధర్ కూతురు కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. విషయంలో ఇరు కుటుంబాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. తన బిడ్డతో ప్రేమ విషయం మరచిపొమ్మని బాసవేని గంగాధర్, అతని తమ్ముడు అంజి పలుమార్లు రాజ్‌కుమార్‌ను హెచ్చరించారు. అయినప్పటికీ ప్రేమ వ్యవహారం కొనసాగుతుం డడంతో రాజ్‌కుమార్‌ను చంపాలని నిర్ణయించుకున్న గంగాధర్, అంజి ఈ నెల 14న రాత్రి రాజ్‌కుమార్ ఇంటికి వెళ్లారు. ఇంట్లో రాజ్‌కుమార్ లేకపోవడంతో అతని తండ్రి గుర్రం చిన్నమల్లయ్యపై అంజి కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచి పారిపోయారు. దీంతో గుర్రం రాజ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై నరేష్ కేసు నమోదు చేశారు. గురువారం అంజి, గంగాధర్‌లను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచినట్లు సీఐ పేర్కొన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం

- కరీంనగర్‌కు చెందిన వ్యక్తి భూపాల్‌పల్లిలో అరెస్టు

కృష్ణకాలనీ(భూపాలపల్లి), జూలై 18: ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసిన వ్యక్తిని, అతనికి సహకరించిన మరో ఇద్దరిని భూపాలపల్లి పోలీసలు కటకటాల్లోకి పంపించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే గురువారం భూపాలపల్లిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల అరెస్టు చూపి వివరాలను వెల్లడించారు. కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన గుర్రం శ్రీనివాస్‌రావు.. భూపాలపల్లి కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయంలో సెక్యూరిటీ గార్డు, స్వీపర్ పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేయుటకు కాంట్రాక్టు తనకే వస్తుందని నమ్మబలికాడు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగులు, ఆశావాహుల నుంచి సుమారు రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు వసూలు చేశాడు. కొంత మందికి జాబ్ కల్పించినట్లుగా డ్యూటీలు చేయించి జీతాలు ఇవ్వకుండా తప్పించుకుని తిరిగేసరికి శ్రీనివాసరావుపై కొంత మందికి అనుమానం కలిగింది. ఇతనికి మరో ఇద్దరు సహకారం అందించారు. నిందితులైన ఆముగ్గురిని బుధవారం రాత్రి అదుపులోకి తీసుకొన్నారు. ఈ మేరకు డబ్బులు తీసుకున్నట్లు అంగీకరించడంతో గురువారం శ్రీనివాసరావు, సుభాష్, అశోక్‌లను రిమాండ్‌కు పంపించారు.

సంక్షేమ పథకాల అమలులో అధికారుల పాత్ర కీలకం

» గిరిజన వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలి » జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్


మాట్లాడుతున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్

సిరిసిల్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల అమలులో అధికారుల పాత్ర కీలకమని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో గురువారం జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌లతో కలిసి సమీక్షించారు. జిల్లాకు వచ్చిన హుస్సేన్‌కు కలెక్టర్, ఎస్పీ అధికారులు ఘనంగా స్వాగతించారు. అనంతరం వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న ప్రభుత్వ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా హుస్సేన్ మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమం కోసం కమిషన్ పనిచేస్తోందని చెప్పారు. గిరిజనులకు ఇబ్బందులు కలిగిస్తే ఎంతవారినైనా శిక్షించే అధికారం కమిషన్‌కు ఉందన్నారు. ప్రజాసమస్యలను సంబంధిత అధికారులు గ్రామస్థాయిలో మండల స్థాయిలో పరిష్కరించేందుకు కృషి చేయాలని అన్నారు. కమిషన్ ప్రతీ మూడు నెలలకు ఒకసారి క్షేత్ర స్థాయి పర్యటనలు చేస్తుందని అన్నారు. దేశ వ్యాప్తంగా వ్యక్తిగతంగా పర్యటిస్తూ గిరిజనుల జీవితాల్లో పురోగతిని కల్పించేందుకు కృషి చేస్తామని అన్నారు. గిరిజన సంక్షేమ వసతి గృహాల స్థితిగతులపై సమీక్షిస్తూ విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కిందిస్థాయిలోనే చిన్న చిన్న మరమ్మతులు ఉంటే చేయాలన్నారు. గిరిజనులు అధికంగా ఉన్న గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, అవసరమైన శిక్షణలు గ్రామీణ యోజన పథకం కింద చేపట్టాలని చెప్పారు. గిరిజనులకు హక్కుగా రావాల్సిన పోడు పట్టా భూములు అర్హత మేరకు పకడ్బందీగా సర్వే నిర్వహించి పంపిణీ చేయాలని తెలిపారు. సమావేశంలో గిరిజన సంక్షేమ అధికారి జనార్దన్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రమేశ్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న అధికారులు

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి


మాట్లాడుతున్న మాజీ సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవయ్య

సిరిసిల్ల టౌన్, జూలై 18: గ్రామపంచాయతీలకు సంబంధించిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడదల చేయాలని తెలంగాణ మాజీ సర్పంచ్‌ల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డు దేవయ్య అన్నారు. సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 12,769 గ్రామ పంచాయతీలు ఉన్నాయన్నారు. 2019 నుంచి గ్రామాల అభివృద్ధి పనులకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రొసీడింగ్‌లు ఇవ్వడంతో అప్పటి సర్పంచ్‌లు లక్షల రూపాయలు అప్పులు తీసుకొచ్చి గ్రామాల అభివృద్ధి కోసం ఉపయోగించారని అన్నారు. గ్రామాలు అభివృద్ధి కోసం సర్పంచ్‌లు చేసిన పనులకు బిల్లులు రాక కొందరు సర్పంచ్‌లు ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. మరికొందరు సర్పంచ్‌లు బిల్లులు రాక అప్పులకు వడ్డీలు కడుతూ ఆర్థికంగా చితికిపోతున్నారని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేయవద్దని వెంటనే గ్రామపంచాయతీలకు సంబంధించిన పెండింగ్ బిల్లును చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం సర్పంచ్‌ల బిల్లుల చెల్లింపులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తెలంగాణ మాజీ సర్పంచ్‌ల సంక్షేమ సంఘం భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకుంటుం దని హెచ్చరించారు. సమా వేశంలో తెలంగాణ మాజీ సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు మిర్యాలకర్ శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏరెడ్డి మల్లారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి సంపనూరి మల్లేశంగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు దేవుని సుజాతనర్సయ్య, జిల్లా కార్యదర్శి నారాయణ, నియోజకవర్గం అధ్యక్షుడు పిట్టల వెంకటేష్, వేముల వాడ మండల అధ్యక్షుడు దొంతి మల్లారెడ్డి, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

గ్రూప్-1 మెయిన్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, జూలై18: గ్రూప్-1 మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులు ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవడానికి శుక్రవారం తుది గడువని కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఔత్సాహికులు తమ దరఖాస్తులను వెబ్‌సైట్ www. tgbcstudy-circle. cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 75 రోజులపాటు నిర్వహించే శిక్షణ ఈనెల 22న మొదలవుతుందని పేర్కొన్నారు. అభ్య ర్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.5 లక్ష లోపు ఉండాలన్నారు. ఎంపికైన వారికి శిక్షణ కాలంలో నెలకు రూ.5000 ఉపకార వేతనం అందజే స్తామన్నారు. ఉచిత శిక్షణ హైదరాబాద్ సైదాబాద్‌లో ని టీజీ బీసీ స్టడీసర్కిల్‌లో, ఖమ్మంలోని టీజీ బీసీ స్టడీసర్కి ల్‌లలో ఇస్తారన్నారు. సమాచారం కోసం 040-24071178 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం

ముస్తాబాద్, జూలై 18: సౌదీ అరేబియాలో గుండెపోటుతో మృతి చెందిన వ్యక్తి మృతదేహం గురువారం ఇంటికి చేరుకోవడంతో కుటుంబీకులు శోకసంద్రంలో మునిగారు. మండలంలోని వెంకయ్యకుంటకు చెందిన పిట్ల మహేశ్(45) 15 ఏళ్లుగా సౌదీ అరేబియాలో అల్ జమీల్ కంపెనీలో కులీగా పనిచేస్తున్నాడు, ఈనెల 4వతేదీన గుండెపోటు రావడంతో చనిపోయడాని కుటుంబీకులు తెలిపారు. సౌదీ నుంచి మృతదేహం గురువారం స్వగ్రామానికి చేరడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సుమారు ఐదు లక్షల రూపాయల వరకు అప్పు ఉందని తెలిపారు. తల్లి మల్ల వ్వ, భార్య కావ్య, కుతూరు నేహ, కొడుకు నవనీత్‌లున్నారు. తెలంగాణా ఎన్ఆర్ఐ డిపార్ట్‌మెంట్ ఇన్ చార్జ్ చిట్టి బాబు, జనగామ శ్రీనివాస్ మృతదేహం హైదరాబాద్ నుంచి స్వగ్రామం రావడం కోసం అంబు లెన్స్‌లో ఏర్పాటు చేశారు. మృతుడి కుటుంబానికి ఐదు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు.

రైస్ మిల్లుల్లో సివిల్ సప్లయి అధికారుల తనిఖీలు


శ్రీరామ ఇండస్ట్రీస్‌లో తనిఖీ చేస్తున్న సివిల్ సప్లయి అధికారులు

జగిత్యాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు రైస్ మిల్లుల్లో గురువారం సివిల్ సప్లయి అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. రాష్ట్ర సివిల్ సప్లయి శాఖ కమిషనర్ చౌహాన్ ఆదేశాల మేరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇతర జిల్లాలకు చెందిన సివిల్ సప్లయి అధికారులు, ఎన్‌ఫోర్స్ బృందాలు రైస్ మిల్లుల్లో దాడులు నిర్వహించారు. ప్రభుత్వం రైస్ మిల్లులకు సీఎంఆర్ కోసం కేటాయించిన ధాన్యం నిల్వలు సరిగా ఉన్నాయా...లేవా అన్న అంశంపై అధికారులు తనిఖీలు నిర్వహించారు. జిల్లాలోని మూడు చోట్ల సోదాలు జరిగాయి. వెల్గటూరు మండలం అంబారిపేటలో గల శ్రీరామ ఇండస్ట్రీస్, రాయికల్ మండలం మైతాపూర్‌లో గల శివమణి ఇండస్ట్రీస్, కోరుట్ల మండలం జోగినిపల్లిలో గల ఎస్ఎల్ఎన్ఎస్ పారాబాయిల్డ్ రైస్ మిల్లుల్లో సివిల్ సప్లయి అధికారులు సోదాలు నిర్వహించారు. రైస్ మిల్లుల్లో గల ధాన్యం నిల్వల ఫిజికల్ వెరిఫికేషన్ జరిపా రు. తనిఖీల్లో గుర్తించిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు జిల్లా సివిల్ సప్లయి అదికారి వెంకటేశ్వర్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల డీఎస్‌వో జితేందర్ రెడ్డి, డీఎం జితేందర్ ప్రసాద్, కరీంనగర్ డీఎస్‌వో సురేశ్ రెడ్డి, అధికారులు ప్రభాకర్, లక్ష్మారెడ్డి, పుల్లయ్యలతో పలు మండలాల తహసీల్దార్లు, సీఐలు, ఎస్ఐలు, సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్లు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. రైస్ మిల్లుల్లో సివిల్ సప్లయి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, డీఎస్‌వోలు, డీఎంలు విస్తృతంగా సోదాలు నిర్వహించడం రైస్ మిల్లు వ్యాపార వర్గాల్లో కలకలం రేపింది.

అరెస్టు నుంచి తప్పించుకోవడానికి యువకుడి ఆత్మహత్యాయత్నం



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

చందుర్తి, జూలై 18: అరెస్టు నుంచి తప్పించుకోవడానికే అఖిల్ అనే యువకుడు భయభ్రాం తులను గురిచేయడం కోసం బ్లేడ్‌తో కోసుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో గురువారం సీఐ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో తొమ్మిది మందిపై నమోదైన గంజాయి కేసులో చందుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన తోట అఖిల్ నిందితుడిగా ఉన్నాడు. వీరిలో అమీర్, కాల్వ వెంకటేష్, పండుగ అభి, రవిని విచారించగా వారందరికీ తోట అఖిల్ గంజాయిని సప్లయ్ చేసేవాడని తెలిసిందన్నారు. దీంతో అఖిల్‌ను చందుర్తి పోలీస్‌స్టేషన్‌కు పిలిపించిన అనంతరం వేములవాడ రూరల్ పోలీసులకు అప్పగించగా వారు తీసుకుపోయే క్రమంలో అప్పటికే తన అన్న రాకేష్ ద్వారా ఒక పథకం ప్రకారం భయభ్రాంతులు గురిచేయాలనే ఉద్దేశంతో బ్లేడు తెప్పించుకొని, అఖిల్ తన శరీరంపైన గాయాలు చేసుకున్నాడన్నారు. ఈ క్రమంలో సిబ్బంది వెంటనే అడ్డుకొని, అతనిని ఆస్పత్రిలో చికిత్స చేయించారని తెలిపారు. అనంతరం అఖిల్‌ను వేములవాడ రూరల్ పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారన్నారు. ఈ సంఘటనలో కేవలం అరెస్టును తప్పించుకోవడానికి ఆడిన నాటకం అన్నారు. చట్ట ప్రకారం చేయవలసిన విధులలో పోలీస్ విధులకు ఆటంకం కలిగిస్తే ఊరుకునేది లేదని, అలాంటి వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. అఖిల్ గంజాయికి, మద్యానికి బానిసై జల్సాలకు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ అరెస్ట్ చేసే సమయంలో పోలీసుల విధులకు ఆటంకం కల్పించడంతో చందుర్తిలో కేసు నమోదు చేశామని వివరించారు.

విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్

గణేశ్‌నగర్, జూలై 18: విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా వినియోగదారులు జాగ్రత్తలు తీసుకోవాలని టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్ తెలిపారు. బట్టలు ఆరవేసే దండెము జిఐ వైర్లపై నుంచి విద్యుత్ వైర్లు వెళ్లడం వలన విద్యుత్ వైర్లలో ఇన్సులేషన్ సరిగ్గా లేకపోవడంతో దండెములకు విద్యుత్ సరఫరా అయి షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. ప్లాస్టిక్ దండెములను ఉపయో గించాలని కోరారు. విద్యుత్ సరఫరా వైర్లను ఎట్టి పరిస్థితుల్లో దండెంలకు, రేకులకు తగల కుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. భద్రత పట్ల నిర్లక్ష్యం, అవగాహన లోపం, గృహాలలో నాణ్యమైన వైరింగ్ లేకపోవడం వల్ల, నాసిరకం విద్యుత్ పరికరాలు వాడటం వలన, రైతులు స్విచ్ బోర్డు/మోటార్ స్టార్టర్‌ల దగ్గర భద్రత ప్రమాణాలు (ఎర్తింగ్) పాటించక పోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. వినియోగదారులు అధికారుల సూచనలు పాటించాలని కోరారు.

● ప్రమాదాల నివారణకు విద్యుత్‌శాఖ సూచనలు..

- రైతులు విద్యుత్ మోటార్లు, పైపులను, ఫుట్ వాల్వులను ఏమరుపాటుతో తాకకూడదు. వ్యవసాయ పంపుసెట్లను, స్టార్టర్లను విధిగా ఎర్తింగ్ చేయాలి. ఎర్త్ చేయని మోటార్లు, స్టార్టర్లు, పైపులు, ఫుట్ వాల్వులు తాకడం అత్యంత ప్రమాదకరం. రైతులు, వినియోగదారులు స్వయంగా సొంతంగా విద్యుత్ పనులు చేసుకోకుండా అర్హత కలిగిన ఎలక్ట్రీషియన్‌తో పనులు చేసుకోవాలి. పశువులను విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వర్షాకా లంలో స్తంభాలు తడిగా ఉండటం వల్ల విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.
- ఇంటి వైరింగ్‌కు సరైన ఎర్తింగ్ చేయాలి. నాణ్యమైన ప్లగ్గులు, సెల్‌ఫోన్ చార్జర్‌ను ఉపయోగించాలి. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అనధికారంగా ఫ్యూజులు మార్చడం, రిపేరు చేయడం, ఏబీ స్విచ్‌ల ఆపరేట్, కాలిన తీగలను సరిచేయడం ప్రమాదకరం.
- కరెంటు లైన్ల కింద పందిరిలు వేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యుత్ తీగలను అమర్చి చేపలను పట్టడం వలన షాక్ గురయ్యే అవకాశం ఉంది. ఇలా చేయడం చాలా ప్రమాదకరం. బోర్లు వేసేటపుడు, జెండా ఎగుర వేయునపుడు పైపులు వైర్లకు తాకకుండా జాగ్రత్త వహించాలి. సెల్‌ఫోన్ ఛార్జింగ్ పెట్టి తడి చేతులతో తాకి మాట్లాడటం వలన షాక్‌కు గురై చనిపోతున్నారు. చార్జింగ్ వైరు తీసి ఫోన్ మాట్లాడాలి. పొలాలకు విద్యుత్ కంచెలు వేయరాదు.
- వర్షాలు కురిసినపుడు తడిసిన విద్యుత్ స్తంభాల స్టేవైరు/సపోర్టు వైరును, తడిచిన విద్యుత్ ఉపకరణాలను తాకరాదు. తెగిపడిన, వేలాడుతున్న, వదులుగా, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను తాకరాదు. ఇలాంటివి గమనించిన వెంటనే విద్యుత్ సిబ్బందికి తెలుపాలి.
- విద్యుత్ షాక్‌కు గురైన వ్యక్తిని ముట్టుకోరాదు. అతడిని రక్షించడానికి విద్యుత్ ప్రవహించని (కర్ర, ప్లాస్టిక్ లాంటి) వస్తువులను వాడాలి.

ఎక్సైజ్ సీఐకి ప్రశంసాపత్రం

- గంజాయి సాగు నియంత్రణలో కీలక పాత్ర


ప్రశంసా పత్రం అందుకుంటున్న సర్వేశ్వర్

జగిత్యాల టౌన్, జూలై 18: గంజాయి సాగు నియంత్రణలో ఎక్సైజ్ సీఐ కీలకంగా వ్యవహరించి ఉన్నతాధికారుల నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకున్నాడు.. జగిత్యాల డివిజన్‌లో ఎక్సైజ్ సీఐగా పనిచేస్తున్న సర్వేశ్వర్ గతంలో ఖమ్మం డివిజన్‌లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐగా విధులు నిర్వహించాడు. గంజాయి సాగుతో పాటు వాటి మూలాలను గుర్తించి 120 కేసుల్లో 4,630 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నాడు. రాష్ట్ర స్థాయిలోనే ఖమ్మం సీఐ గంజాయి నిర్మూలనలో మొదటి స్థానంలో నిలిచాడు. సీఐ సర్వేశ్వర్ ప్రతిభను గుర్తించిన ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలహాసన్ రెడ్డి ప్రశంసాపత్రాన్ని జారీ చేశారు. ఖమ్మం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ గణేష్‌ల చేతుల మీదుగా గురువారం ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన జగిత్యాల సీఐ సర్వేశ్వర్‌ను గురువారం జగిత్యాల ఎక్సైజ్ సూపరింటెండెంట్ సత్యనారాయణతో పాటు పలువురు అభినందించారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడి దుర్మరణం


బాలు(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జూలై 18: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఉన్న డివైడర్‌ను ఢీకొని బొప్పాపూర్ గ్రామానికి చెందిన వేముల బాలు (35) అనే యువకుడు గురువారం రాత్రి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. బాలు ఇటీవల గల్ఫ్ నుంచి స్వగ్రామానికి వచ్చాడు. ద్విచక్ర వాహనంపై గొల్లపల్లి నుంచి ఎల్లారెడ్డిపేట వైపుకు వెళుతున్న క్రమంలో వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. దాంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించామని పోలీసులు వివరించారు. బాలుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాధితకుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

- సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి



యువతకు కౌన్సెలింగ్ చేస్తున్న డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి

తంగళ్లపల్లి, జూలై 18: నేరాల నియంత్రణనే లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తోందని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వడ్డెర కాలనీ, దొమ్మరి వాడలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మట్లాడుతూ ప్రజల రక్షణ గురించి, సమస్యలు నేరుగా తెలుసుకొనే అవకాశం ఉంటుందని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పట్టణ, గ్రామంలో, కాలనీలో ఎవరైనా కొత్త వ్యక్తులు, నేరస్తులు వచ్చి షెల్టర్ తీసుకుంటున్నారా అనే విషయం కూడా తెలుస్తుందన్నారు. నేరరహిత గ్రామాలుగా చేయలనే ఉద్దేశంతోనే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మాదక ద్రవ్యాలను, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగాన్ని నియంత్రించేందుకు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. యువత మాధకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, గ్రామాల్లో గంజాయికి సంబంధించిన సమాచారం ఉంటే అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచతామన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో సరైన ధ్రువపత్రాలు లేని, నంబర్ ప్లేట్స్ లేని 15 ద్విచక్ర వాహనాలు సీజ్ చేశామని తెలిపారు. వాహనాలు నడిపే ప్రతీ ఒక్కరు తప్పనిసరిగా వారి యొక్క వాహనాలకు ఆర్‌సీ, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ కలిగివుండాలని తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గ్రామాలలో మరింత స్వీయ రక్షణ కోసం సీసీ కెమెరాలను అమర్చుకోవాలన్నారు. పోలీసుల సహకారం ఉంటుందని, భద్రతా పరమైన అంశాల్లో, నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో సీఐ మొగిలి, ఎస్ఐలు సుధాకర్, శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది, డిస్ట్రిక్ట్ గార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

రుణమాఫీపై రైతులు, కాంగ్రెస్ నేతల సంబరాలు


కాట్నపల్లిలో పాల్గొన్న కలెక్టర్ శ్రీహర్ష తదితరులు


పాలకుర్తిలో పాల్గొన్న ఎమ్మెల్యే మక్కాన్ సింగ్


రాఘవపూర్‌లో పాల్గొన్న రైతులు, అధికారులు

పెద్దపల్లి రూరల్, జూలై 18 : తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఒకే దఫాలో రుణమాఫీ చేయడం పట్ల రైతులు ఆనందం వ్యక్తం చేశారు. గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో సమావేశమై రుణమాఫీని ప్రకటించనుండగా మండలంలోని రాఘవపూర్ రైతు వేదికలో సమావేశాన్ని మండల వ్యవసాయాధికారి అలివేణి ఏర్పాటు చేశారు. మండలంలోని రైతులు రాఘవపూర్ రైతువేదికకు చేరుకోని సంబరాలు జరుపుకున్నారు. ముఖ్యమంత్రి ప్రసంగాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులు వీక్షించారు. అనంతరం విడతల వారిగా రెండు లక్షల వరకు మాఫీ చేస్తామని ప్రకటించిన సందేశాన్ని రైతులు, అధికారులు, సింగిల్ విండో చైర్మన్‌లు, డైరెక్టర్‌లు తిలకించారు. సమావేశంలో సింగిల్‌విండో చైర్మన్ చింతపండు సంపత్, ఏఈవోలు, సింగిల్ విండో డైరెక్టర్‌లు, బ్యాంకర్లు, రైతులు పాల్గొన్నారు.

జ్యోతినగర్, జూలై 18 : రైతు రుణమాఫీ సందర్భంగా గురువారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ట్రాక్టర్ నడుపుకుంటూ మేడిపల్లి రైతు వేదిక వద్దకు వెళ్లారు. భారీ వర్షం కారణంగా సీఎం వీడియో ప్రసంగం కార్యక్రమాన్ని మేడిపల్లి రైతు వేదికలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ వీక్షించ లేకపోయారు. రుణమాఫీకి సంబంధించి మార్గదర్శకాలను విడుదల చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబులకు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ అనిల్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు ఆసీఫ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి, జూలై 18: గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు పలు హామీలను ఇచ్చి మాట తప్పిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీ రైతుల కళ్లలో ఆనందం నింపిందని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులతో పాటు పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీకి ఉన్న శ్రద్ధ ఇతర ఏ పార్టీలో కానరాదన్నారు. ఈ కార్యక్రమంలో మనాలి ఠాకూర్, పలువురు వ్యవసాయ శాఖ అధికారులతో పాటు ఎంపీడీవో పొల్సాని శశికళ, మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ గౌడ్,నాయకులు బయ్యపు మనోహర్ రెడ్డి, పాత రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మారం, జూలై 18: ప్రభుత్వం రైతులకు రూ. లక్ష రుణ మాఫీ చేయడాన్ని హర్షిస్తూ గురువారం ధర్మారంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రెవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, మార్కెట్ చైర్మన్ రూప్లానాయక్, కాంగ్రెస్ నాయకులు చింతల జగన్‌మోహన్‌రెడ్డి, కాంపెల్లి రాజేశం, రవీందర్‌రెడ్డి, అజయ్‌పాల్‌రెడ్డి, బొల్లి స్వామి తదితరులు పాల్గొన్నారు. కాగా,మండలంలోని బొట్లవనపర్తి రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ సీఎం రెవంత్‌రెడ్డి ప్రసంగాన్ని వీక్షించారు.

ముత్తారం జూలై 18: రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీని ప్రకటించడంతో గురువారం మధ్యాహ్నం నుంచి రైతు వేదికల్లో సంబరాలు ప్రారంభించారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి రైతు వేదిక వరకు కాంగ్రెస్ నాయకులు రైతులతో కలిసి ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ అనంతరం బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులు చొప్పరి సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీలు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

రామగిరి, జూలై 18:మండలంలోని రత్నాపూర్ రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీడియోకాన్ఫరెన్స్‌లో రైతులు స్వల్పసంఖ్యలో పాల్గొన్నారు. రుణమాఫీపై ముఖ్యమంత్రి సందేశం అనంతరం నాయకులు సీఎం, మంత్రి శ్రీధర్‌బాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

కాల్వశ్రీరాంపూర్, జూలై 18: కాంగ్రెస్ ప్రభుత్వ సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు రుణమాఫీ చేసిన సందర్భంగా గురువారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి అనంతరం రైతు వేదికలో కాంగ్రెస్ నాయకులు స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, ఆ పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, నాయకులు బంగారి రమేష్, సబ్బని రాజమల్లు, అల్లం దేవేందర్, గోలి సుధాకర్, ఆరెల్లి రమేష్, ఎండీ సజ్జు, ఎండీ మునీర్, ఈద సత్యానారాయణరెడ్డి, శివరామకృష్ణ, ధ్యాగేటి రామచంద్రం, రావి సదానందం, ఆటికం శంకర్ గౌడ్ పాల్గొన్నారు.

ఎలిగేడు, జూలై 18 : మండల కేంద్రంలోని అంబేద్కర్‌చౌక్‌లో గురువారం రైతు రుణమాఫీ చేయడంపై కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. సీఎం, మంత్రుల ఫొటోలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సామ రాజేశ్వర్ రెడ్డి, నాయకులు దుగ్యాల సంతోష్‌రావు, కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, బావు సంపత్, అర్షనపల్లి వెంకటేశ్వర్ రావు, గోడెల శ్రీనివాస్‌రెడ్డి, గొల్లె భూమేష్, నరహరి సుధాకర్‌రెడ్డి, బాలసాని పర్శరాంగౌడ్, కొండ తిరుపతి గౌడ్, కోప్పర తిరుమల్‌రెడ్డి, బూర్ల వెంకటసత్యం, సింగిరెడ్డి రాంచందర్‌రెడ్డి, తానిపర్తి వెంకటేశ్వర్‌రావు, అమ్ముల రమేష్, రాజు, ఓదెలు, పల్లెర్ల వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు. కాగా, మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో మండలంలోని 12 గ్రామాల రైతులు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొని సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని వీక్షించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి ఉమాపతి, ఏఈవోలు పద్మ, గణేష్, వివిధ గ్రామాల రైతులు, కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జూలపల్లి, జూలై 18 : సీఎం వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షించేందుకు మండలంలోని తెలుకుంట రైతువేదికలో వ్యవసాయ అధికారులు ఏర్పాటుచేశారు. సీఎం ప్రసంగాన్ని రైతులు వీక్షించారు. మండల వ్యాప్తంగా 2337 మంది రైతులకు లక్ష రూపాయల వరకు రుణమాఫీని ప్రభుత్వం మొదటి విడతలో అందిస్తుందని ఏవో ప్రత్యూష పేర్కోన్నారు.ఈ కార్యక్రమంలో ఏఈవో రాకేష్, కిరన్మయి, శ్రీవాణి, రైతులు చెరుకు రవిందర్‌రెడ్డి, అమరగాని లింగయ్యగౌడ్, పెసరు లచ్చయ్య, పలువురు రైతులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్, జూలై 18: రుణ మాఫీని పురస్కరించుకుని కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. సుల్తానాబాద్ పట్టణంలో రైతులతో కలసి బైక్ ర్యాలీ నిర్వహించి ఐబీ చౌరస్తా వద్ద స్వీట్లు పంపిణీ చేశారు. రుణమాఫీ పొందిన రైతులను నాయకులు సన్మానించారు. కాట్నపల్లిలో రైతువేదిక వద్ద ఎస్సీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షులు కలువల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీఎం, మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే విజయరమణారావు చిత్రపటానికి క్షీరాభిసేకం చేశారు. పట్టణ, మండల శాఖల అధ్యక్షుడు వేగోలం అబ్బయ్యగౌడ్, బ్లాక్ అధ్యక్షుడు దన్నాయక్ దామోదర్‌రావు, ఆనందరావు, నాయకులు మినుపాల ప్రకాష్‌రావు, అంతటి అన్నయ్య గౌడ్, పన్నాల రాములు, రాజలింగం, శ్రీగిరి శ్రీనివాస్, సాయిరి మహేందర్, నీలయ్య, కల్లేపల్లి జానీ, నోముల రాజిరెడ్డి, ఇల్లెందుల శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. కనుకుల చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఇల్లెందుల శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ పోలు అంజయ్యమీస సత్యనారాయణ, రాంరెడ్డి, చుక్క మొగిలి పాల్గొన్నారు.

కాగా మండలంలోని కాట్నపల్లి గ్రామంలోని రైతు వేదికలో ఏర్పాటుచేసిన సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు. అధికారులు, రైతుల అభిప్రాయాలను కలెక్టర్ వీక్షించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి, కేడీసీసీబీ డైరెక్టర్లు మోహన్‌రావు, శ్రీగిరి శ్రీనివాస్, మినుపాల ప్రకాష్‌రావు, ఆనందరావు, కలువల శ్రీనివాస్, ఏవో దేవిడ్‌అనిత, ఉద్యాన శాఖ అధికారులు జ్యోతి, ఏఈఓలు ప్రశాంత్, వినీత్, రాజ్‌కుమార్, సౌమ్య, ప్రత్యూష పాల్గొన్నారు.

మంథని, జూలై 18: రుణమాఫీలో భాగంగా మండలంలోని 2863 మంది రైతుల ఖాతాల్లో రూ. లక్షలోపు రుణాల డబ్బులు గురువారం జమయ్యాయి. సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌ను మంథని మండలంలోని గుంజపడుగు రైతువేదికలో రైతులు, అధికారులు, ప్రజాప్రతినిధులు వీక్షించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పెంద్రు రమ-సురేష్‌రెడ్డి, కేసీసీ అధ్యక్షుడు ముస్కుల సురేందర్‌రెడ్డి, టీజీఈఆర్సీ అడ్వైజర్ శశిభూషణ్ కాచే, మాజీ ఎంపీపీ కొండ శంకర్, ఆకుల కిరణ్, మండల వ్యవసాయ అధికారి భూక్య మోహన్ పాల్గొన్నారు. కాగా, ప్రభుత్వం రైతులకు రుణ మాఫీ చేయడం పట్ల స్థానిక అంబేద్కర్ చౌక్‌లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బాణా సంచా కాల్చి, స్వీట్లు పంపిణీ, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మంత్రి శ్రీధర్‌బాబు సోదరుడు శ్రీనుబాబు ఎడ్లబండ్ల ర్యాలీలో కలిసి పాల్గొన్నారు.

కమాన్‌పూర్, జూలై 18 : మండల కేంద్రంలో గురువారం రుణమాఫీపై కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రంగు సత్యం, నగునూరి నర్సాగౌడ్, నాయకులు ముస్తాక్ శేవ్వ, అబ్దుల్ రఫీక్, గడప కృష్ణమూర్తి, యూసఫ్ లల్లూ, బోనాల సత్యం, మల్యాల మహేష్‌గౌడ్, పంజా సాయిరాం ఉన్నారు.

● రుణమాఫీ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు మండలంలోని గుండారం గ్రామంలోని రైతు వేదిక కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన రుణమాఫీ కార్యక్రమంలో వ్యవసాయాదికారులు, రైతులు పాల్గొన్నారు. రైతులనుద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రుణమాఫీ అంశంపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏవో బండి ప్రమోద్‌కుమార్, తహసీల్దార్ అరిపోద్దీన్, ట్రాన్స్‌కో ఏఈ రాజేందర్, ఏఈవో సురేష్, మండల స్థాయి అధికారులు, నాయకులు వైనాల రాజు, ఇంగంటి భాస్కర్‌రావు, కోలేటి మారుతి, బిర్లా కృష్ణ తదితరులు ఉన్నారు.

ఓదెల, జూలై 18 : మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో గురువారం రైతులు రుణమాఫీ సంబరాలు నిర్వహించారు. సీఎం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రుణ మాఫీని ప్రారంభించి లబ్ధిదారులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు.

రైతు రుణమాఫీని లాంఛనంగా ప్రారంభించడం పట్ల కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి, ఆళ్ళ సుమన్ రెడ్డి, కోట సత్యనారాయణరెడ్డి, పడాల రాజు, పిట్టల రవికుమార్, చొప్పరి రాజయ్య, ఉడిగె సదయ్య తదితరులు పాల్గొన్నారు.


సుల్తానాబాద్‌లో క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


తెలుకుంట రైతువేదికలో పాల్గొన్న అధికారులు, రైతులు


ధర్మారంలో..


కాల్వశ్రీరాంపూర్‌లో..


ఎలిగేడులో..



పరీక్షలకు సర్వం సిద్ధం : సీఎండీ

గోదావరిఖని, జూలై 18: సింగరేణిలో మార్చి 1వ తేదీన జారీ చేసిన ఉద్యోగ ప్రకటనలో మొత్తం 10కేటగిరీలలో 272 ఎక్స్‌టర్నల్ పోస్టుల భర్తీకి హైదరాబాద్ కేంద్రంగా ఈనెల 20, 21తేదీల్లో పరీక్షలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు సింగరేణి సీఎండీ ఎన్ బలరాం పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మొత్తం 18,665మంది అభ్యర్థులకు హాల్‌టికెట్లను జారీ చేసినట్లు వెల్లడించారు. తొలిసారిగా కంప్యూటర్ ఆధారిత పరీక్షలను(సీబీటీ) నిర్వహిస్తున్నట్లు వివరించారు. హైదరాబాద్ జంటనగరాల్లో 12పరీక్ష కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్ష ప్రారంభానికి అరగంట ముందే పరీక్ష కేంద్రం గేట్లు మూసివేస్తారని, అభ్యర్థులు తమ అడ్మిట్ కార్డుతో పాటు ఏదేని ప్రభుత్వ ఫోటో గుర్తింపు కార్డు, రెండు పాస్ పోర్ట్‌సైజ్ కలర్ ఫోటోలు తీసుకురావాలన్నారు. అడ్మిట్‌కార్డులు డౌన్‌లోడ్ చేసుకోవడంలో ఇబ్బందులు తలెత్తితే హెల్ప్‌డెస్క్ 08744-249992 నంబరులో సంప్రదించాలన్నారు.

కార్మికులకు స్పెషల్ క్వార్టర్ కౌన్సెలింగ్

గోదావరిఖని, జూలై 18: గోదావరిఖని రోడ్డు వెడల్పులో భాగంగా గురువారం ఆర్‌సీఓఏ క్లబ్‌లో స్పెషల్ క్వార్టర్ కౌన్సెలింగ్ నిర్వహించారు. జీఎం చింతల శ్రీనివాస్, రామగుండం తహసీల్దార్ జీ కుమారస్వామి పాల్గొన్నారు. హనుమాన్‌నగర్, శివాజీనగర్‌లకు చెందిన క్వార్టర్లకు సంబంధించిన వారికి నూతనంగా క్వార్టర్ల కౌన్సెలింగ్ నిర్వహించారు. 63మంది ఈ కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు. స్పెషల్ కౌన్సెలింగ్‌లో హౌస్ అలాట్ కమిటీ జీఎం రాంమోహన్, పర్సనల్ ఏజీఎం లక్ష్మీనారాయణ, ఎస్టేట్ ఆఫీసర్ సాంబశివరావు, సీనియర్ పీవో హనుమంతరావు, సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి పాల్గొన్నారు.

రేపు ఆయుర్వేద వైద్య శిబిరం

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 18: మాతా రీసర్చ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద సౌజన్యంతో శనివారం కాలనీలో ఆయుర్వేద శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆర్జీ-2 అధికార ప్రతినిధి రాజేంద్రప్రసాద్ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఆయుర్వేద వైద్యులు విశ్వనాథ మహర్షి పరీక్షలు నిర్వహించి, మందులను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగులు, పరిసర, ప్రభావిత ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్మిక కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

గోదావరిఖని, జూలై 18: ఓసీపీ-2 ప్రమాదంలో మృతిచెందిన వెంకటేశ్వర్లు, విద్యాసాగర్ మృతదేహాలను గురువారం సింగరేణి ఏరియా ఆసుపత్రిలో రాముగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ శ్రీనుబాబు, మినిమమ్‌వేజ్‌బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్ సందర్శించి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. విద్యాసాగర్ తల్లి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ను చూడగానే బోరున విలపించింది. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ప్రమాదానికి బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సింగరేణి సీఎండీ బలరాంనాయక్‌ను కోరారు. బార్డర్‌లో సైనికులతో సమానంగా పనిచేస్తున్నారని, సైనికులు దేశాన్ని కాపాడితే దేశానికి సింగరేణి కార్మికులు వెలుగునిస్తున్నారన్నారు. ప్రమాదం జరుగడం బాధకరమని, దీనిపై వెంటనే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదం నుంచి బయట పడిన కార్మికులను, స్పృహ కోల్పోయి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కుటుంబ సభ్యులను పరామర్శించారు. అచేతనంగా ఉన్న వారిని చూసి ఎమ్మెల్యే కంటతడిపెట్టారు.


బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గని ప్రమాద మృతులకు ప్రభుత్వం అండ..

- పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ

కోల్‌సిటీ, జూలై 18: సింగరేణి ఆర్జీ-3 పరిధిలోని ఓసీపీ-2లో బుధవారం మట్టి కుప్పల్లో కూరుకుపోయి మృతిచెందిన వెంకటేశ్వర్లు, గాదం విద్యాసాగర్ కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ చెప్పారు గురువారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌తో కలిసి విద్యాసాగర్, వెంకటేశ్వర్లు మృతదేహాలకు నివాళులర్పించారు. వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. సింగరేణి యాజమాన్యం రక్షణ చర్యలు పాటిస్తూ బొగ్గు ఉత్పత్తిని వెలికి తీయాలని, పని స్థలాల్లో రక్షణ చర్యలను ముమ్మరం చేయాలని సూచించారు. మృతి చెందిన కార్మిక కుటుంబాలకు అన్ని రకాల బెనిఫిట్స్‌తో పాటు కార్మిక కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

ఓసీపీ-2 ప్రమాద మృతుడికి నేతల నివాళి

రామగిరి, జూలై 18: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2 సెకండ్ షిఫ్టులో బుధవారం జరిగిన ప్రమాదంలో మృతిచెందిన ఉప్పు వెంకటేశ్వర్లు మృతదేహాన్ని గురువారం ఏరియా ఆసుపత్రి నుంచి మధ్యాహ్నం మూడు గంటలకు సెంటినరీకాలనిలోని నివాసం ఉండే క్వార్టర్‌కు అంబులెన్స్‌లో తరలించారు. వెంకటేశ్వర్లు మృతదేహాన్ని కడసారి చూసేందుకు పెద్దసంఖ్యలో వివిధ ట్రేడ్ యూనియన్ నాయకులు, మహిళలు చేరుకుని కన్నీటి పర్యంతం అయ్యారు. వెంకటేశ్వర్లు మృతదేహానికి టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు కొట రవీందర్ రెడ్డి, బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, నాయకులు నివాళి అర్పించారు. అనంతరం పన్నూరు సెంటర్‌లోని శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన డైరెక్టర్స్(ఆపరేషన్స్)

సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2లో బుధవారం కార్మికులు ఉప్పు వెంకటేశ్వర్లు, విద్యాసాగర్ సజీవ సమాధి అయిన ఘటనా స్థలాన్ని బుధవారం అర్ధరాత్రి సింగరేణి డైరెక్టర్స్(ఆపరేషన్స్) ఎన్‌వికే శ్రీనివాస్, డైరెక్టర్(పీపీ) వెంకటేశ్వర్‌రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ మైన్ సేఫ్టీ బానోతు వెంకన్నలు పరిశీలించారు. క్వారీలోని ఘటన స్థలాన్ని పరిశీలించారు. పైప్‌లైన్ మరమ్మతులు కోసం చేపట్టిన గుంతను పరిశీలించినట్లు తెలిసింది. ప్రమాదానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. దీనిపై సమగ్ర విచారణకు ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

పెద్దపల్లి రూరల్, జూలై 18: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పెద్దపల్లి సీఐ కృష్ణ అన్నారు. డ్రగ్స్‌కి బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని ఆయన సూచించారు. గురువారం మండలంలోని మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో రామగుండం పోలీస్ కమీషనర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి పోలీస్ ఆధ్వర్యంలో డ్రగ్స్ నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ డ్రగ్స్, మత్తు పదార్థాలకు అలవాటు పడటం వల్ల నేరాలకు పాల్పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. కళాశాలల్లో ర్యాగింగ్‌కి పాల్పడితే చట్ట రీత్యా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి ఎస్‌ఐ-2 మల్లేష్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్,అకౌంట్ ఆఫీసర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

●పాలకుర్తి, జూలై 18: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించి తమ లక్ష్యాలను నెరవేర్చుకోవాలని బసంత్‌నగర్ ఎస్‌ఐ ఆర్ స్వామి అన్నారు. బుధవారం మండల పరిధిలోని బసంత్‌నగర్ ఐఎంఎస్ పాఠశాలలో విద్యార్థులకు డ్రగ్స్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు.

జేఎన్టీయూలో డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్ష

రామగిరి, జూలై 18: మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం డీఎస్సీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం జరిగిన పరీక్షకు వంద మంది అభ్యర్థులకు 78 మంది హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మంథని సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎస్సై వెంకటకృష్ణ బందోబస్తు చేపట్టారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కాల్వశ్రీరాంపూర్, జూలై18: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తహసీల్దార్ జాహెద్‌పాషా, ఎంపీడీవో రామ్మోహనచారి సూచించారు. గ్రామ గ్రామాన గురువారం డ్రై డే కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్ర మంలో ఎంపీవో గోవర్దన్, సీహెచ్‌ఓ సరస్వతి, పీహెచ్‌ఎన్ భాగ్యలక్ష్మి, హెచ్‌ఈఓ లక్ష్మణ్, సూపర్‌వైజర్లు నీరజ, సరోజ, ఏఎన్‌ఎంలు, గ్రామ కార్యదర్శిలు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

ఎలిగేడు, జూలై 18: మండలంలోని రాములపల్లి, నర్సాపూర్, బురహాన్ మియాపేట్ గ్రామాల్లో శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. పీహెచ్‌సీ వైద్యులు నిస్సిక్రిష్టాన, సీహెచ్‌వో విజేందర్‌రాజు, సూపర్‌వైజర్స్ లక్ష్మణ్, నాగరాణి పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి


మొక్కలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి

పెద్దపల్లిటౌన్, జూలై 18: ప్రతీ ఒక్కరు మూడు మొక్కలు నాటి సంరక్షించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మమతారెడ్డి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని 21వ వార్డు శాంతినగర్‌లో మమతారెడ్డి ఇంటింటికీ పండ్ల మొక్కల పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లా డుతూ మానవ మనుగడకు అతి ముఖ్యమైనవి చెట్లు అని అన్నారు. పట్టణంలో విరివిగా మొక్కలు నాటి స్వచ్ఛ పెద్దపల్లిగా నిలపాలన్నారు. ఇందు కోసం ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ అనిల్ కుమార్, నర్సరీ ఇన్‌చార్జి సదానందం, మెప్మా ఆర్‌పీ అజ్మీత, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మల్కాపూర్‌లో ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ పర్యటన

జ్యోతినగర్, జూలై 18: ఎన్‌పీడీసీఎల్ సూపరింటెండెంట్ సుదర్శన్ గురువారం కార్పొరేషన్ 5వ డివిజన్ మల్కాపూర్, శాతపల్లిలో పర్యటించారు. డివిజన్ పరిధిలో నెలకొన్న విద్యుత్ సమస్యలు, తరుచూ విద్యుత్ అంతరాయానికి సంబంధించి కాంగ్రెస్ నేత ఎండి.రహీం స్థానిక ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఎస్ఈ సుదర్శన్ డివిజన్‌లో పర్యటించి విద్యుత్ సరఫరా సంబంధ సమస్యలపై ఆరా తీశారు. తక్షణ చర్యగా మల్కాపూర్, శాలపల్లి ఏరియాలో ఇబ్బందికరంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు.

21న శిక్షణ తరగతులు

కాల్వశ్రీరాంపూర్, జూలై 18: ఆల్‌ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఈనెల 21న పెద్దపల్లిలోని ఆర్‌కే గార్డెన్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు జూపాక ఉమామహేశ్వర్ తెలిపారు. భారతదేశంలో ఇంకా అగ్రవర్ణాల చేతిలో ఎస్సీ, ఎస్టీ, బీసీలు బలైపోతున్నారన్నారు. వారు విద్యాపరంగా వెనుకబడి పోతున్నారన్నారు. ఈ విష యంపై శిక్షణ తరగతులు ఉంటాయని, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రైతులు శ్రీరాంపూర్ తరలిరావాలి

ఎలిగేడు, జూలై 18: మండలంలోని 12గ్రామాల రైతు సోదరులు శుక్రవారం కాల్వశ్రీరాంపూర్ మండలం పెద్దరాతుపల్లికి తరలిరావాలని మండల వ్యవసాయశాఖ అధికారి ఉమాపతి పేర్కొన్నారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ కంపెనీ స్థాపించడం కోసం పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి వెళ్లే వారి సౌకర్యార్థం ఉదయం ఎలిగేడు నుంచి బస్సు ఏర్పాటు చేశామన్నారు. సమాచారం కోసం 9154680529 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

గ్రూప్-2 పరీక్ష వాయిదా వేయాలని ధర్నా

పెద్దపల్లిటౌన్, జూలై 18: గ్రూప్-2 పరీక్షలు వాయిదా వేయాలని, పోస్టులను పెంచాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా గ్రంథాయలం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అర్ల సందీప్, జిల్లాల ప్రశాంత్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్ మౌర్య, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు గద్దల సిద్ధార్థ, నాయకులు రోషన్, రాజు డివైఎఫ్ఐ నాయకులు శ్రీనివాస్, నవీన్ పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

పెద్దపల్లి రూరల్, జూలై 18: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పట్ల ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎంపీవో సుదర్శన్ అన్నారు. గురువారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో చేపడుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈసందర్భంగా రోడ్లపై నీటి గుంతలు ఏర్పడగా మట్టిని పోయించి చదును చేయించారు. వానాకాలంలో నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌తో పాటు సిబ్బంది ఉన్నారు.

'పుట్ట మధుపై ఆరోపణలు సరికాదు'

కమాన్‌పూర్, జూలై 18: జడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధుపై కాంగ్రెస్ నాయకులు ఆరోపణలు చేయడం సరికాదని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పుట్ట మధు హయాంలోనే నియోజకవర్గ అభివృద్ధి జరిగిందన్నారు. మంథని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పుట్ట శైలజపై ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు బొమ్మగాని అనిల్‌గౌడ్, మహిళ విభాగం మండల అధ్యక్షురాడు పొన్నం రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీల్లో చిన్నారులను చేర్పించాలని ర్యాలీ

పెద్దపల్లి రూరల్, జూలై 18 : చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని గురువారం మండలంలోని అప్పన్నపేట అంగన్‌వాడీ కేంద్రం ఉపాధ్యాయురాలు మండల విమల ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పథకాలు, పౌష్టికాహారం, సదుపాయాలను వివరిస్తూ చిన్నారులతో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట పేరిట చేపట్టే నూతన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడి టీచర్ మండల విమల పేర్కోన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు , చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.